# కాశీపతి కల్పనం

బయటికి వెడుతూ రాజలింగు అన్న మాటలు సుమతి చెవుల్లో రింగులు తిరుగుతున్నాయి. పుష్పక విమాన మెక్కి ఆకాశం అంచుల్లో కెళ్లినట్టు.... ఒళ్లంతా పులకింతలు, గిలిగింతలు.

ఆ రోజు శుక్రవారం.... సూర్య కిరణాల కంటే ముందే కాళికాదేవిగుడి ముందు వాలాలనే ఆరాటం రాజలింగును పోటీకి నిలబెట్టింది. ఏ మాత్రం ఆలస్యమైనా గుడికి దూరంలో బిక్కు బిక్కు మంటూ గడపాల్సొంటుంది. ముందువెళితే ముందుసీటు. ఎక్కువ ఫలితం. ఈసూత్రం బాగా తెలుసతనికి.

అందుకే– చీకటి కాకులు కావు కావు మనక ముందే మసక వెలుతురు తెరల్లో ముంత పట్టుకెళ్తాడు. తన రేకుల షెడ్డు వెనక భాగం ఖాళీ స్థలంలో ముఖ ప్రక్షాళనం పూర్తయిపోతుంది. మరో బకెట్టునిండా సర్కారు బోరింగు నుండి నీళ్ళు తెచ్చుకుంటే స్నానంగూడా పూర్తవుతుంది. స్నానం చేసే టప్పుడు రామ రామ శబ్దం పెదాల మధ్య నలిగిపోతుంది. దాంతో పూజ కూడా అయిపోతుందనే తృప్తి కలుగుతుంది.

ముసుగుదన్ని వెల్లకిలా పడుకున్న సుమతి ఇవన్నీ చూస్తోంది చెవుల్తో.

రేకుల షెడ్డుతో మిలాఖతైన చలి ప్రాణాలు తోడేస్తుందనుకుంది కాని, అనుకున్నంత చలి లేదు. పైగా రాజలింగు పక్కనుంటే చలీ గిలీ ఏవీ నిలవ్వు. మొహమ్మీది ముసుగు దుప్పటి తొలగించింది. షెడ్డు పైకప్పు రంధ్రాలు చుక్కల్లా కనబడుతున్నాయి.

రాజలింగు అవిటివాడైనా....ఎంత మంచోడు.... ఎంత బాగా మాట్లాడుతాడు! తనంటే ప్రత్యేకమైన ఇది!.... రాజలింగు గుండె గట్టిది.. అదేదీ .... వజ్రం....వజ్రంలాంటిది. లేకపోతే చిన్నప్పుడే కన్ను తీసేసి యాచక వృత్తిలోకి దింపిన కాశీపతికి, నలుగుర్నీ హడలేత్తించే కాశీపతికి.... ఏనుగులాంటి కాశీపతికెదురు నిల్చి మాటకు మాట జవాబివ్వగలడా? మాటకు మాట ఎదురు జవాబిచ్చి అతని ఉచ్చులోంచి బయట పడగలిగే వాడా? లేబర్ కాలనీలో షెడ్డు కొనుక్కోగలిగేవాడా? వృత్తి అడుక్కోవడమైనా నిజాయితీగా బ్రతకాలంటాడు. అందులోనే తృప్తి పొందాలంటాడు.

సరిగ్గా పదమూడేళ్ళ క్రితం....

సింహాచలం తిరుణాల్లో తప్పిపోయింది సుమతి. అప్పటికే తననీ లోకంలో పడేసిన తల్లి మరోలోక మెళ్లిపోయింది. తండ్రి మరో ఆడదాని మెడలో తాళికట్టి తాను ఉరితాడు తగిలించుకున్నాడు - కొత్త పెళ్లాం వింత కోర్కెలు చెల్లించలేక. సుమతి వయసు అయిదేళ్లుందనగా .... సవతి తల్లి తిరుణాల్లలో కావాలనే వదిలేసిందో లేక తానే తప్పిపోయిందో ఇంకా అంతు బట్టలేదు. అప్పుడే కాశీపతి కంట్లో పడింది - ఏడుస్తూ.

బిస్కెట్ ముక్క చేతి కిచ్చి - "రా! మీనాన్న దగ్గరికి తీసికెళ్తా" నని చేతులు చాచాడు కాశీపతి.

నిజమేననుకుని చేతులందించింది - గౌనుతో కళ్లు తుడుచుకొని. కాశీపతి తనను వరంగల్ దాకా తీసుకొస్తాడని ఊహించే వయసు కాదది. అప్పటికే ఒక కన్ను తీసివేయబడి వృత్తిలో అనుభవం సంపాదించిన రాజలింగు సుమతి నేమీ చెయ్యొద్దని కాళ్లా వేళ్లా పడి బతిమాలాడు.

"పోబే....పట్టుమని పదేళ్ళు లేవు.... నాదారి కడ్డమొస్తావురా ముండా కొడుకా!" రాజలింగు చెంపల మీద పడిన దెబ్బలు ఎర్రబారాయి.

అతడు బిత్తర చూపులు చూస్తూ పక్కకి తొలగిపోవడం ఇంకా గుర్తుంది.

ఆదేరోజు సుమతి ఒంటి కన్నుదైంది.

"నువ్వు పెద్దగైనాక నాకుపయోగపడ్తావని ఒకటే కన్ను తీయించానే పోరీ?" కాశీపతి వెకిలి నవ్వుల సుడులు గుండెలో బడబాగ్నుల్ని నింపాయి.

రాజలింగు, సుమతి ఒకేచోట అడుక్కునేవారు. వేయి స్థంభాల గుడి వద్ద, కోట గోడ ముందున్న దేవాలయం వద్ద, వెంకటేశ్వరాలయం ముందు, కాళికమ్మవారి గుడిముందు, కాస్సేపు అడుక్కోవడం, అతర్వాత ఆడుకోవడం

సరదాగా గడిచిపోయేవి రోజులు.

అందరికంటే తక్కువ అడుక్కొస్తున్నారని కోప్పడేవాడు కాశీపతి. ఓరోజు....అడుక్కునే సమయంలో ఆడుకోవడం చూచి ఇద్దర్నీ వేరుచేశాడు. వేర్వేరు గుళ్లవద్ద అడుక్కోవాలని ఆదేశం వినిపించాడు-వీపులు పచ్చడిచేసి.

ఒక కన్ను బావున్నా- రెండు కళ్లు లేనట్టు నటిస్తూ ఎలా దేవిరించాలో కాశీపతి కుడి భుజమైన దేశపతి నేర్పించాడు మరోసారి.

దేశపతి నేర్పించినట్టుగా "అయ్యా! గుడ్డిదాన్నయ్యా! అమ్మా గుడ్డి దాన్ని, తల్లీ....కళ్లులేని కపోతినయ్యా!" అంటూ ఎదుటివారి గుండెల్లో జాలి పుట్టించడ మలవాటైంది. సాయంత్రం ఎవ్వరికీ కనబడకుండా స్థావరం చేరడం. మసక వెలుతురులో వసూలైన డబ్బులన్నీ రాజలింగు ముందు కుమ్మరించడం- రోజువారీ కార్యక్రమం.

గుడ్డిదీపం వెలుతురులో, అన్నం తినేటప్పుడు రాజలింగు పక్కనే కూర్చుండి అదో రకమైన తృప్తి అనుభవించేది. అతని పక్కనుంటే హాయిగా అలసట తీరినట్టనిపించేది.

ఓ రోజు తన చరిత్ర చెప్పాడు రాజలింగు.

అతని రెండేళ్ల వయసప్పుడే దేశపతితో కలిసి కాశీపతి దొంగిలించాడట. ఇంటిముందాడుకుంటున్న వాడికి బిస్కెట్లు చూపించి ఎత్తుకొచ్చారట. ఇప్పుడు తన తల్లిదండ్రుల్ని గూడా గుర్తు పట్టడట పాపం!

పిల్ల బిచ్చగాళ్ళ స్థావరాన్ని ఒకచోటు నుండి మరోచోటుకు మారుస్తున్నప్పుడు పారిపోబోయి పట్టుబడ్డాడట. కాశీపతి కోపానికి ఘోరంగా గురయ్యాడట.

"ఈ సారి పారిపోయే ప్రయత్నం చెయ్యనయ్యా!" అని ఎంతమొత్తుకున్నా వినే నాథుడు కరువయ్యాడట.

"అమ్మా....అమ్మా" అంటూ ఆకాశానికి వినబడేలా అరుస్తుంటే .... ఆ డాక్టరెవరో మత్తుమందిచ్చి మరీ నరికేశాడట కుడి కాలును. అప్పట్నుంచీ ఎన్నిసార్లు స్థావరం మారినా కిక్కురుమనలేదట.

పెద్దయింతర్వాత గురు కట్నం కింద కాశీపతికి రెండువేల రూపాయలు సమర్పించి వెళ్ళిపోవాలనేది నిబంధన.

రాత్రిలలో ప్రత్యేకంగా అడుక్కుని అంత డబ్బు పోగుచేసి సమర్పించుకున్న తర్వాత వెళ్లిపోవచ్చు. దాన్నే గురుకట్నంగా చెప్పుకుంటారు.

ఆ నిబంధనను తిరస్కరించి తన దారి తను చూసుకున్న రాజలింగు ధైర్య సాహసాల్ని తోటివారెందరో పొగిడారు.

"నేను పెద్దయ్యానుగదా ... మీ కట్నం సమర్పించి నేనుగూడా వెళ్లి పోతా దొరా!" అంది సుమతి- ప్రాణాలు అరచేతిలో పెట్టుకు నోసారి.

"ఎవ్వరి నొదిలినా నిన్నుమాత్రం వదల్నే చిలకా! నిన్ను పెంచి పోషించింది ఎవడికో ఒప్పజెప్పేందుకా? చూస్తూ చూస్తు దోరమాగిన మామిడి పండును జార విడుచుకునే వెధవనా?" కాశీపతి మీసాలు మెలేశాడు. అతని చూపుల్లో ఆకలి కొట్టొచ్చినట్టు కనబడింది.

ఆ రోజు రాత్రి.... దేశపతి హడావుడి అంతా ఇంతా గాదు. గదిలో ఏమేమో అమర్చాడు. కొత్తచీరా, జాకెట్టు తెచ్చి-కట్టుకొమ్మన్నాడు సుమతిని. ఆరోజేదో పండగనుకుని కట్టుకుంది. అలంకరించిన గదిలో కెళ్ళమన్నారు. లోపల కాశీపతి కానుక్కూచుంటాడనుకోలేదు సుమతి. గడియవేయబడ్డ గదిలో పులినోట్లో మేకలా గిజగిజలాడింది కాశీపతి కరకు చేతుల్లో.

"నా బంగారు కొండవే...వెన్నపూస ముద్దవే..."అంటూ ఎక్కడెక్కడో తడిమి ఏమేమో చేస్తుంటే ఎదిరించే ధైర్యం, చొరవ లేక తోలుబొమ్మగా మారిపోయింది.

మంచి పలుకుబడి సంపాదించిన కాశీపతికి పట్టణంలో మూడంతస్థుల భవనాలు మూడున్నాయి. అందులోకల్లా పెద్ద భవనం చుట్టూ రకరకాల పూల మొక్కలున్నాయి. ఇంటి చుట్టూ తోట. ఇంటిలోపల భార్యాపిల్లలు. పేరుకు మాత్రం ఓ ఫాన్సీషాపుంది- హన్మకొండ చౌరస్తాలో. అవన్నీ రాజలింగే చూపించాడోసారి సుమతికి.

"మనలాంటోల్ల ఉసురుతో కట్టిన మేడలివే" నంటూ పళ్ళు పట పట లాడించాడు. ఆతని పిడికిళ్ళు బిగుసుకు పోయాయెందుకో – ఆ క్షణాన.

"వీడి బద్మాష్‌తనం గురించి పోలీసోల్లకు చెబితే గొర గొర గుంజుక పొయ్యి చమ్డాలూడదీస్తారు గందా!..." అంది అంతవరకా ఆలోచన ఎవరికీ తట్టనందుకు విసుక్కుంటూ.

"నీకు తెల్వదే సుమతీ!" ఒంటికన్ను చాటెడంత జేసి పగిలిన కరంటు బల్బులా నవ్వి- "పోలీసోల్లగ్గూడా నెల నెలా మామూలందుతుందే. లంజెల కంపెనీలనుండి అకులాడుకునే క్లబ్బులనుండి, మన కాశీపతిలాంటోల్ల నుండి నెలనెలా మామూళ్ళు ముడుతున్నాయి. కాబట్టే అటువంటి దందాలు నడుస్తుంటై. అందుకే... ఎవలకు రిపోర్టిచ్చినా లాభంలేదు. ఇచ్చినోడి చమ్డాలే

అరగడతారు. కాశీపతికి సంగతి తెలిస్తే పగబట్టి ఈ దునియానుంచే లేపేత్తాడు" అన్నాడు రాజలింగు ఒంటి కాలుకు ఆసరాగా ఉన్న చంక బద్దల మీద నిల్చుండి.

రాజలింగుకంటే ముందే పోలిగాడు ధైర్యం చేశాడు. గురువు కట్నానికి గుడ్‌బై చెప్పి పరుగు లంకించుకున్నా డెక్కడికో. మూడో రోజే పోలిగాడి ఆచూకి తెలిసింది. దేశపతికి పిస్తోలిచ్చి పంపించాడు కాశీపతి - వాడంతు చూడమని. ఎవరికీ తెలీకుండా దేశపతివెంట బయలుదేరాడు కాశీపతి పిస్తోలుతో.

నడిరాత్రి...దేశపతి పిస్తోలు పేలి పోలిగాడు దాగున్న గుడిశె దద్దరిల్లింది. పోలిగాడు శవమైపోయాడు క్షణాల్లో. కాస్త దూరం నుండి కాశీపతి పిస్తోల్ పేలింది. దేశపతి అక్కడికక్కడే కొట్టుకు చచ్చాడు. గుండెల్లో దిగబడిన గుళ్ళను భరించలేని దేశపతి అరుపులూ, ఏడ్పులూ ఎవ్వరికీ వినబడలేదు, కనబడలేదు. మర్నాటి పత్రికల్లో చిన్నవార్త కనిపించింది. పోలిగాడు దేశపతి పాత పగల్తో ఒకర్నొకరు కాల్చుకు చచ్చారని,

స్థావరంలో గుప్పుమందీ వార్త. అసలు నిజం అందరికీ తెలిసిపోయింది ఆయినా ఏం లాభం? ఎవరైనా నోరు తెరిస్తే తెల్లారేసరికి శాశ్వతంగా మూసేస్తా డా నోటిని కాశీపతి.

ఏవేవో జ్ఞాపకాలు మెదడులో సుడులు తిరుగుతూంటే- మసక చీకట్లో ముడుచుకు పడుకుంది సుమతి.

"ఇంగ నిద్ర లెవ్వే సుమతీ!" నాల్గోసారన్నాడు రాజలింగు - చంక కట్టెల్ని టక టక లాడిస్తూ.

తాను రాజలింగు దగ్గరి కెందుకొచ్చినట్టూ...? ఔను... తాను వచ్చిన పని మరిచింది. తానొచ్చి నాల్రోజు లైందప్పటికే. ఇప్పుడే గుర్తొకొస్తోంది...

"నువ్వు రాజలింగు గాడి దగ్గరే ఉండి- డబ్బెక్కడ దాచాడో కనిపెట్టు. వానికంట్లో కారంగొట్టి ఆ డబ్బంతా పట్టుకురా... వాడి తిక్క తిరుగుతుంది భడవది!" కాశీపతి పురమాయింపు.

రాజలింగును చూడక నెలరోజులైం దప్పటికే. ఒక్కరోజన్నా రాజలింగును చూడకుంటే, అతని ఒంటి కన్ను వెలుగులో స్నానం మాడకుంటే ఏదోలా ఉంటుంది. ఇప్పటికైనా చూస్తే... నిప్పు కణంలా మండుతున్న ఒంటికి మంచు ముద్ద రాసినట్టుంటుంది.

సరేనంది వెంటనే. అన్నదే తడవుగా లేబర్ కాలనీవైపు పరుగెత్త బోయింది.

"బలే ఖుషి పడిపోతున్నావ్ గదే!" తన అంతరంగాన్నెలా గుర్తు బట్టాడో కాశీపతి - కళ్ళలోకి తీక్షణంగా చూస్తూ "నేం జెప్పిన పని దప్ప నువ్వింకేం జేసినా నీ ప్రాణాలు పై లోకానికెళ్ళిపోతాయ్ జాగర్త! నువ్వంటే ఆ గుడ్డి నా కొడుకు పడి ఛస్తాడు. డబ్బు ఎక్కడ దాచినా నీకు తప్పకుండా చెబుతాడు. రెండు వేలు ఎగ్గొట్టిండు గదా! నాల్గు వేలకు తగ్గకుండా పీక్కురా! తెలిసిందా!!" గద్దించాడు.

"తెలిసింది దొరా!" పిల్లి కూనై పోయింది తను. ఎండకు వాడిన పూవైంది మొహం.

"అరె.... సుమతీ! గింత పొద్దుగాల నువ్వెట్ల వస్తివే?" తనను చూడ గానే రాజలింగు కంటిలో కాంతిపుంజం విచ్చుకుంది. మొహం వెలిగిపోతోంది. తీసేసిన కన్ను గుంటలో కదలిక కనిపించింది.

"బయటే నిల్చుండి- "నీ కోసమే వచ్చినా. కాశీపతి కండ్లె కారం గొట్టి వచ్చినా. నిన్ను చూడకుంటే నాకు ఏడుపొస్తది. రావన్నా లోపలికి?" ఆనందం అబద్ధం కలెగలుపుకు పోయినై - తన గుండెలో.

"రాయే.... లోపలికి రా!" చెయ్యి పట్టుకు లాగాడు. నిలదొక్కుకోలేక రాజలింగు గుండెమీద వాలిపోయింది - చెట్టుమీంచి రాలిన పూవులా. తన బుగ్గలమీద సొగసు సంపెంగలు పూచినై. వాటిని మనో నేత్రంలో ఏరుకుంటూ పొంగి పోయాడు రాజలింగు.

"మంచి పంజేసినవ్. వానికి గురువు కట్నమైతే ఇవ్వలేదు గదా!?" మురిసి పోతూ నీళ్ళ కుండ చేతికందించి బోరింగు పైపు చూపించాడు.

"నీ లెక్క నేను గూడా ఎగనామం బెట్టినా ....!" నీళ్ళ కొరకు పరుగెత్తింది తను.

మూడ్రోజులు ముచ్చటగా ఖర్చయినై-కబుర్లతో. తియ్యగా సన్నగా పలికే సుమతి గొంతు వింటూంటే ఇంకా వినాలనిపిస్తుంది రాజలింగుకు. చీరలో అజ్ఞాతవాసం చేస్తున్న ఆమె సొంపుల్ని చూస్తు ఏదో లోకంలో కెళ్ళి పోతున్నాడు. చెదిరిన సుమతి ముంగురుల్ని సవరిస్తున్నాయతని వేళ్ళు. ఆమె నుదుటి ఎర్రని తిలకం, కొండ చిలువలాంటి పొడుగాటి జడ, అడ్డంగా ఎదిగిన చేపలాంటి ఒంటి కన్ను... ఏదో చేస్తున్నాయతన్లో.

సుమతి వచ్చిన్నుంచి అడుక్కోడానికి వెళ్ళాలన్న ధ్యాసే లేదు. ఆవిడుంటే ఇంకే లోకమూ వద్దనిపిస్తుంది.

సన్నగా ముడుచుకున్న కన్ను, వంకీల జుట్టు, బలంగా మెలేసిన కండరాలు....రాజలింగును తదేకంగా చూస్తు కూచుంది సుమతి.

"రేపు శుక్రవారం. కాళికాదేవి గుడికి పోవాలే. ఎల్లుండి వెంకటేశ్వర స్వామి గుడిల ధర్మ లగ్గాలవుతాయట. నువ్వూ, నేనూ పోదాం ఎల్లుండటు.." గురువారం పడుకోబోయేముందన్నాడు రాజలింగు-మరేదోఅర్థం ధ్వనించేలా.

"నేనా్రను.... కాశీపతి గాడన్నా వాని చెంచా గాడెవడన్నా చూస్తే కొంప మునిగిపోతుంది" అంది - తనకెన్నో బంగళాలున్నట్టూ-అవన్నీ కూలి పోతాయన్నట్టుగా, సుమతి బుంగ మూతిలో దోసెడు సొంపులు నిండుకున్నై.

"నువ్వు శానా అందంగుంటావు సుమతీ. రంభా, ఊర్వశి... అంటారు గదా... అట్లుంటవు"

రాజలింగు మాటలకు - కరిగి గాల్లోకి తేలిపోయింది.

కిరసనాయిల్ దీపాన్ని సవరిస్తూ... "ఆఁ ఎవలన్నారు గట్ల ఉంటాననీ! నా సంగతి నాకు దెల్వదు గానీ, నువ్వైతే మన్మధ మారాజులాగుంటవు" బుస బుస పొంగిన లజ్జా భారాన్నాపులేక నవ్వేసింది.

రాజలింగు ముఖం చేటంతయింది.

వేర్వేరుగా పరచిన పక్కల్ని ఒక్కచోట చేర్చి "సింగారం గురించి వేరే ఇంకొకడు చెప్పాల్నా? నీకేం తక్కువైందనీ, వయసులో ఉండవలసిన సొంపులన్నీ ఉన్నై..." అన్నాడు పెదాలు చప్పరిస్తూ.

కుత్తుకలో ఒత్తుకు పోతున్న ఆనందాన్ని జివ్వుమంటున్న నరాల పొంగును ఎలా బయట పెట్టాలో అర్థం కాలేదు సుమతికి.

"గిట్టా ఎప్పుడన్నా మాట్లాడిండా కాశీపతి, దొంగ ముండా కొడుకు...." ప్రశ్నించింది అంతరంగం.

"అబ్బా అంత బాగున్నానా?" పక్కలోకొచ్చి కూచుంది. కన్నుకన్ను కలిసింది.

"ఔను నీ గురించి నీకు తెల్వదే...." భుజమ్మీద చెయ్యేసి దగ్గరకు లాక్కున్నాడు.

వద్దనబుద్ధి కాలేదు సుమతికి.

వయసొచ్చినన్నుంచి ఆడ స్పర్శ ఎరుగని రాజలింగు శరీరం కొత్త అనుభూతి కాలవాలమైంది. మరో చెయ్యి సుమతి మరో భుజం మీద పడింది.

ఏదో గుర్తుకొచ్చి చటుక్కున తప్పుకుంది.

"అదృష్టం బాగలేనోళ్ళకు ఎక్కడబోతే అక్కడ పిల్లి అడ్డమొస్తది రాజలింగూ!" రెప్పల మధ్య నిలిచిన కన్నీటి బొట్లనాపే ప్రయత్నం విఫలమైంది.

ఖంగు దిని... కొస్త ముందుకు జరిగాడు.

"అదేందే .. ఎందుకట్లంటున్నావు? ఇప్పుడు నీ అదృష్టానికేమైందనీ?"

"నేను....నేను....వాసన చూసిన పువ్వును, నీకు పనికిరాను....నాబతుకు బండలల్ల కలిసింది. రాజలింగూ...." వెక్కి వెక్కి ఏడుస్తుంది.

"నాకంతా తెలుసు సుమతీ! నువ్వు బలవంతానికి లొంగినావు. ఇష్ట పూర్వకంగా కాదుగదా. నీ మనుసుల నేను ఉన్నాను గదా....!నాకు మాత్రం నువ్విప్పటికీ నీటి చుక్క అంటని తామరాకువే. ఎవ్వడేమన్నా నేను ఫరవా చేయను." సుమతి తొడమీద తలానింది.

ఎన్నడూ లేని ఆనందం తొంగిచూచింది సుమతిలో. దిగంతాల్లోకి చూస్తూ అతని జుట్టులోకి వేళ్లు పోనిచ్చింది.

"నిజంగానా... నిజంగానేనా రాజలింగూ..." అతని పెదాల్ని మెత్తగా స్పృశించింది తన పెదాల్తో.

కొన్ని కిలోవాట్ల విద్యుత్ ప్రవహించిం దతని నరాల్లో, లేచి కూచుని తదేకంగా చూచాడావిడ పెదాల్ని. దొండ పండు పెదాల మధ్య మల్లెపువ్వులా మెరిసిందో చిరునవ్వు. అతని వక్ష స్థలం మ్మీద ఒంగిపోయింది మెల్లగా. మల్లెపూల రథమ్మీద ఊరేగు తోందతని మనస్సు.

మబ్బుల్ని చూచిన మయూరమైంది సుమతి. వింతను చూడలేక కసిగా నవ్వుకుని కళ్లుమూసుకుంది కిరసనాయిల్ దీపం.

తెల్లవారుతోంది. నల్లని చీకటి బూడిద వర్ణమైంది. తయారై వెళ్ళబోతూ.

"రేపు వెంకటేశ్వర్ల గుడిలో ధర్మ లగ్గా లవుతున్నాయన్నాను గదా! మనం గూడా లగ్గం జేసుకుందాం సుమతీ!" అన్నాడు రాజలింగు.

జవాబు కెదిరిచూడకుండా షెడ్డుదా టెళ్ళిన వైపే నిలిచింది సుమతి కన్ను.

సుప్రభాత సూర్య కిరణాలు చెంపల్ని ముద్దాడేదాకా కూచుందలాగే— ఏదో లోకాల్లో విహరిస్తూ.

మనసు దూది పింజలా ఎగిరిపోతోంది... ఇహ తనకు పెళ్ళవుతుంది. రాజలింగుకు తోడూ నీడగా ఉండి ముత్తయిదువుగా గర్విస్తుంది....ఆలోచనల్లోనే పనులు చేసుకుపోతుంది - యాంత్రికంగా.

మధ్యాహ్నం ఎండ నిప్పులు గుప్పిస్తోంది.

"దొర నిన్ను జల్దిరమ్మన్నాడు సుమతక్కో" అన్నాడు స్థావరంనుండి పరుగెత్తుకొచ్చిన నర్సిమ్మడు - రొప్పుతూ. కాశీపతిని దొర అని పిలవడం స్థావరంలో వారందరికి అలవాటే.

" ఎందుకురా? " అనుమానం, అసహ్యం తొంగి చూచింది సుమతి గొంతులో.

"నాకేం తెల్సూ?" వచ్చిన వేగం కంటే రెట్టింపు వేగంతో లగెత్తాడు వెనక్కి తిరిగి చూడకుండా.

కడుపులోని పేగుల్ని కచకచా నరికినట్టనిపించింది. గుండెలో దడ. నరాల్లో నిస్సత్తువ....సన్నని వణుకుతో బయల్దేరింది.

"ఇయ్యాల్లటికి నాల్రోజులు.... నేం జెప్పిన పని పాతరబెట్టి నువ్వు జాతర జేసుకుంటున్నావా? ఆ కుంటీ, గుడ్డి నాకొడుకుతో ఊసులాడ్తున్నావా, బాసల్జేసు కుంటున్నావా?" ఉరిమాడు కాశీపతి.

హడలెత్తింది సుమతి మనసు. నాలుక తడారి పోతోంది. ఒళ్లంతా చెమట అలుముకుంది. గుండె వేగం హెచ్చి గుండె లెగసి పడ్తున్నై - అల్లకల్లోల సముద్ర కెరటాల్లా.

"చెప్పవేమే? వాణ్ణి మర్డర్ చెయ్యకుండా ఉపాయంతో సాధించాలనుకుంటే....ఛీఛీ....నిన్ను పంపించినా ఫలితం లేదా? ఇంతకీ ఏంజేసినావీ నాలొరోజులూ?" ఉరుముల స్థాయి తగ్గింది.

సుమతి తల నేలకు వంగింది. కొంచెం ధైర్యమొచ్చింది.

"ఈ మూడ్రోజులు రాజలింగు షెడ్డుదాటి బయట కెళ్ళలేదు. అడుక్కునేందుగ్గూడా పోలేదు...ఇయ్యాల్లనే పోయిండు. షెడ్డంతా వడ పోద్దామనుకుంటుంటే... నర్సిమ్మడొచ్చి చెప్పిండు నువ్వు రమ్మన్నవని...." అంది.

అయినా కడుపులోంచి భయం మాయం కాలేదు.

రాజలింగుతో తన యవ్వారం గురించి ఎవరన్నా చెప్పినారో ఏమో దొరకు....!

ఎవరు చూసింద్రని చెబుతారూ?

గోడలగ్గూడా చెవులుంటా యంటారు. షెడ్డు రేకులకు చెవులూ, కళ్లు గూడా ఉన్నాయేమో....

కడుపులోని బాధ కళ్ళద్వారా బయటకొస్తోంది. కను కొలుకుల్లోంచి రాలిన నీటి బిందువులు భూమ్మీద మెరుస్తున్నాయి.

"అరె! గంత భయమెందుకే? నిన్నేమన్నా కొరుక్కు తింటున్నానా?" మరికొంచెం తగ్గి మీసమ్మీద చెయ్యేసి "మన కట్టుబాటుసి కాదన్న పోలిగాడి గతే వీడికి పడుతుంది. లంజా కొడుకు! నాకే టోక్రా ఇచ్చి పోయిండుగదూ! ఒకనెనుక ఇంకొకడు గిట్లే పోతుంటే ఇంక నా పెత్తన మెందుకు? రేప్పొద్దున అందరు గదే తొవ్వదొక్కుతరు.... వాణ్ణి ఖతం జేసి - అప్పుడు దేవులాడుదాం వాడి షెడ్డంతా..."

రంకె లేస్తున్న కాశీపతి వాలకానికి ఖంగు తింది సుమతి. గుండెలో ఏదో ఘోష.

అదిమి పట్టిన అసహ్యం బయటపడకుండా జాగ్రత్త పడుతూ "ఐతే.... ఏం జేద్దాం దొరా?" అంది తలెత్తి.

"చెప్తా, చెప్తా..."

పక్క గదిలో కెళ్లొచ్చిన కాశీపతి చేతిలో నాటు బాంబు... ఉల్లిగడ్డ కంటే కొంచెం పెద్ద గుంటుంది.

"ఇగో....ఇజ్జూడు... నువ్వు మల్లా వాండగ్గరికే పో చీకటైనాక. దీన్ని మాత్రం జాగ్రత్తగా దాచుకో. సమయం చూచి దీన్ని వాని మీద విసిరేయ్. విసిరేసి నువ్వురికిరా... మిగతా విషయాలు నేం జూసుకుంటా..." అంటూ నవ్వాడు కాశీపతి. అతడంత భయంకరంగా నవ్వడం ఎన్నడూ వినలేదు సుమతి,

"సరే దొరా..." అంది. అంతరంగంలోని అల్లకల్లోలం తొణికిపోకుండా జాగ్రత్త పడుతూ.

లేబర్ కాలనీకి, పట్టణానికి వారధిగా చిన్న చెరువొకటుంది. దానికో చెరువు కట్ట వుంది. చెరువు కొక పక్క నీరుంటే, మరోపక్క పొలాలు. చెరువు లోని నీటిని ఎండలు తాగెయ్యటం మామూలే. అలాంటప్పుడు పొలాలకు

జలాల నందించేందుకు చెరువు నానుకొని పొలాల పక్కన నోర్లు తెరుచుక్కూచున్నాయెన్నో బావులు. బావుల చుట్టూ లొట్టపీసు చెట్లు-ఇరవై నాలుగ్గంటలు కాపలా కాస్తుంటాయి.

కొన్ని పుట్ల బరువును మోసుకెల్తున్నట్టు-సుమతి అడుగులు బరువుగా పడుతున్నాయి చెరువు గట్టుమీద. కొంగులున్న నాటు బాంబు జారిపోకుండా పట్టుకుంది.

ఉదయం....

రాజలింగు చెప్పిందేమిటి, తాను చెయ్యబోతున్న దేమిటి?

ఎండిపోయిన చెట్టు తొర్రలాగున్న జీవితానికి వసంతం ప్రసాదిస్తానన్న రాజలింగునా తాను...

ఊహుం.... తనవల్ల కాదు. కాకపోతే మరెలా? కాశీపతి చెప్పినట్టు చెయ్యక పోతే పుట్ట గతులుండవు. ఇద్దర్నీ చంపేస్తాడు - మరెవ్వరైనా పురమాయించి....

తను తక్షణం ఎటన్నా పారిపోతే....!? రాజలింగు ప్రాణాల్తో ఉండ గలుగుతాడా? ఊహుం.... అదీ సాధ్యం కాదు. కాశీపతి పగబట్టిన నాగుబాము.

సుమతి మొఖం నిండా చెమట. చెమట పూచిన మొహం మంచులో తడిసిన ముద్ద మందారమైంది.

వెనక ఏదో అలికిడి....గిరుక్కున వెనక్కి తిరిగింది. అలసిపోయిన సూర్యుడప్పటికే మసక చీకటి వెలుతుర్లో దాక్కుంటున్నాడు.

పది గజాల దూరంలో బావి. బావి పక్కన చెట్లు కదుల్తున్నాయి. ఎవరో మనిషి...ఔను మనిషే....గుండె గుభేల్‌మంది. కాస్సేపలాగే చూస్తుంటే ఆ ఆకారం....అరె కాశీపతి...అతడు కాశీపతే. చేతిలో ఏదో ఉంది.

నా వెంట....చాటు మాటున ఎందుకొస్తున్నట్టూ?

పోలిగాడి చావుతో ముడిపడ్డ దేశపతి చావు...ఔను అందుకే...అందుకే అయ్యుంటుంది. ఐతే నేను రాజలింగు మీద బాంబు వేస్తే కాశీపతి నామీద.. హమ్మా!... పుక్కు పుటా లెగిసి పడుతున్నాయి. గుండె వేగం హెచ్చింది.

శక్తినంతా కూడ దీసుకుంది... నరాలన్నీ బిగుసి పోతున్నాయి. మొండి ధైర్యమేదో మెదట్లో మెదల్తాంది. కొంగులున్న నాటు బాంబు చేతిలో కొచ్చింది. సూటిగా విసిరింది పొదలోకి.

ఢాం ఢామ్మని రెండు శబ్దాలు ... దిక్కులు మార్మోగిన శబ్దాలు... అణుబాంబు పేలిన శబ్దాలు...

"అమ్మా...!" కాశీపతి ఆర్తనాదం అనంతాకాశాని కంటింది. పక్కనున్న బావిలో వడిపోయినట్టుంది...మరోశబ్దం. నీటిలో మనిషి పడిన శబ్దం.

జనాలు...జనాలు పరుగెత్తుకొస్తున్నారు. చెరువు గట్టు రెండు పక్కల నుండీ జనాలు. లేబర్ కాలనీ జనాలు...పట్నం జనాలు...అందరిలో సుమతి ఒకతి.

శనివారం... వేంకటేశ్వరాలయం కొన్ని జంటల ధర్మ లగ్నాలతో శోభిల్లింది. అందులో ఒక జంట రాజలింగు-సుమతిలది.

వార్తా పత్రికల్లో కాశీపతి ఫోటో పడింది. "కోటీశ్వరుడు కాశీపతి దుర్మరణం" శీర్షికతో.

"శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు స్థానిక చెరువు గట్టు బావిలో కోటీశ్వరుడు కాశీపతి శవం తేలింది. బాంబు దాడికి గురై మరణించినట్టు పోస్టుమార్టం రిపోర్టు తెలుపుతోంది. ఇది తీవ్రవాదుల చర్య అయియుండవచ్చని పోలీసు వర్గాల అంచనా." *

(ఆంధ్రప్రభ. వార పత్రిక 17-4-1991)